క్లుప్తంగా

రెవెన్యూ సదస్సుల్లో వినతులివ్వండి

పొదలకూరు: మండలంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయా గ్రామాల్లో జరిగే రెవెన్యూ సదస్సుల్లో వినతులు ఇవ్వాలని తహసీల్దార్ శివకృష్ణ సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శివకృష్ణ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు వినతి పత్రాలను అందించి సమస్యలను పరిష్కరించాల్సిందిగా కోరారు. వెంటనే సంబంధిత వీఆర్వోలను పరిశీలించాల్సిందిగా తహసీల్దార్ ఆదేశించారు.

అద్దాలు, ఫర్నిచర్ ధ్వంసంపై ఫిర్యాదు

వెంకటాచలం: వెంకటాచలంలోని క్లస్టర్ ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో అద్దాలు, ఫర్నిచర్ ధ్వంసంపై డాక్టర్ కిషోర్ శ్రీరామ్ ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంకటాచలం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సీహెచ్‌సీకి వచ్చి వైద్యం విషయమై డాక్టర్ కిషోర్ శ్రీరామ్, సిబ్బందితో గొడవపడి దుర్భాషలాడి, అద్దాలు, ఫర్నిచర్ ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వధూవరులకు కాకాణి ఆశీర్వాదం



కోవూరు: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నలుబోలు సుబ్బారెడ్డి, పోతిరెడ్డిపాళెం సర్పంచ్ శ్రీవాణిల కుమారుడి వివాహం ఈనెల 4 తేదీన జరిగింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం పోతిరెడ్డిపాళెం గ్రామంలోని సుబ్బారెడ్డి నివాసానికి విచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట నాయకులు వీరిచలపతి, దొడ్డంరెడ్డి నిరంజం బాబురెడ్డి, పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు శివుని నరసింహులురెడ్డి తదితరులున్నారు.

శంభులింగేశ్వర స్వామికి విశేష పూజలు



విడవలూరు: మండలంలోని యలగాళమ్మగుంట గ్రామంలో శంభులింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేకాలంకరణ చేశారు. భక్తిగీతాలను ఆలపించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఎంపులూరు సుధాకర్, రాజేశ్వరి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

మొక్కబడిగా నర్సరీలు

- ఇనుకుర్తి నర్సరీలో అడుగంటిన మొక్కలు
- సిద్ధంగా ఉన్న 50 వేల మొక్కలు కాదు.. చెట్లు
- ఈ ఏడాదికి లక్ష్యాలు లేక.. తగ్గిన మొక్కల పెంపకం
- రోడ్ అవెన్యూ మొక్కలపై పర్యవేక్షణ కరువు

పచ్చదనం, పర్యావరణ పరిరక్షణకు సామాజిక అటవీశాఖతో పాటు ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, రైతుల పొలాల గట్లతో పాటు, రోడ్ అవెన్యూ ప్లాంటేషన్‌కు ప్రాధాన్యత ఇస్తూ.. 'అమ్మ' పేరుతో ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి చూస్తే అందుకు విరుద్ధంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. సామాజిక అటవీశాఖ పరిధిలో నిర్వహించే నర్సరీల్లో మొక్కలు పెంపకానికి ఈ ఏడాది స్వస్తి పలికారు. మొక్కుబడిగా నర్సరీలు నిర్వహిస్తున్నారు.



ఇనుకుర్తి నర్సరీలో వివిధ రకాల పెద్ద మొక్కలు

పొదలకూరు: పచ్చదనం పెంపొందించేందుకు, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు సామాజిక అటవీశాఖ అధీనంలోని నర్సరీల్లో రకరకాల మొక్కలను పెంచుతున్నారు. ఏటా వేల సంఖ్యలో మొక్కలను పెంచి ప్రభుత్వ కార్యాలయాలతోపాటు, స్వచ్ఛంద సంస్థలకు అందజేస్తున్నారు. ఇందులో ప్రధానంగా ఎర్రతురాయి, పచ్చతురాయి, నిద్రగన్నేరు, చింత, నేరేడు, గంగరావి మొక్కలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో ప్రభుత్వ లేఅవుట్లకు మొక్కలను అందజేసేందుకు సామాజిక అటవీశాఖ అధికారులు ప్రాధాన్యతను ఇచ్చేవారు.

నిర్లక్ష్యమా..నిర్లిప్తత..

పచ్చదనంతో పాటు, పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రభుత్వంతోపాటు అటవీశాఖ అధికారులకు ఉంటుంది. ఈ నేపథ్యంలో మొక్కలను ఉచితంగా పంపిణీ చేసేందుకు సామాజిక అటవీశాఖ అధికారులు మొక్కలను అందించాల్సి ఉంది. ప్రతి ప్రభుత్వ కార్యక్రమం సందర్భంగా ఒక మొక్క నాటడం ద్వారా ప్రజల్లో ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలనే ప్రచారం కల్పించడం జరుగుతోంది. అయితే ఈ ప్రభుత్వం పచ్చదనంతోపాటు పర్యావరణ పరిరక్షణను గాలికి వదిలేసినట్లు తెలుస్తోంది. కావాల్సిన వారు సంబంధిత అధికారులతో మాట్లాడి ఉచితంగా మొక్కలను తీసుకు వెళ్లేందుకు అవకాశం ఉంది. అయితే ఈ ఏడాది తక్కువ సంఖ్యలో మొక్కలను పెంచి ఉన్న మొక్కలను ఇప్పటికే తరలించారు. పొదలకూరు మండలం ఇనుకుర్తిలో సోషల్ ఫారెస్ట్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న నర్సరీ సుమారు మూడు దశాబ్దాలుగా నిర్వహిస్తూ రకరకాల నీడనిచ్చే మొక్కలను పెంచుతున్నా ఈ ఏడాది లక్ష్యాల మేరకు మొక్కలను పెంచలేకపోయినట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం ఈ నర్సరీలో 50 వేలు మొక్కలే ఉన్నట్లు సమాచారం. అవి కూడా పెద్ద మొక్కలు మాత్రమే ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

ప్లాంటేషన్ అవెన్యూపై పర్యవేక్షణ కరువు

అటవీశాఖతోపాటు ప్రభుత్వ అధికారుల్లో ప్లాంటేషన్ అవెన్యూపై పర్యవేక్షణ కొరవడింది. ఒక పక్క సాక్షాత్తు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రతి ఒక్కరూ మొక్కనాటాలని విస్తృత ప్రచారం చేస్తున్నారు. కానీ స్థానిక అధికారుల్లో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఈ ఏడాది నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని తగ్గించేసినట్లు తెలుస్తోంది. రోడ్ అవెన్యూ ప్లాంటేషన్ ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా జరుగుతోంది. అయితే పర్యవేక్షణ లేకపోవడంతో మొక్కలు నాటినా సక్రమంగా బతకడం లేదు. గతంలో కూడా ఇదే పరిస్థితి తలెత్తినట్లు గ్రామస్తులు వెల్లడిస్తున్నారు. నిబంధనల ప్రకారం మొక్కలు నాటితే చుట్టూ కంపకట్రతో కంచెను ఏర్పాటు చేసి ట్యాంకర్లతో నీటిని పోయాలి. అయితే ఇలాంటి పర్యవేక్షణలో లేకపోవడంతో మొక్కలు మధ్యలో చచ్చిపోతున్నాయి.



పర్యవేక్షణ కొరవడిన రోడ్ అవెన్యూలో మొక్కలు

మొక్కలు తక్కువగా ఉన్నాయి

నర్సరీలో మొక్కలు తక్కువగా ఉన్నాయి. పెద్ద మొక్కలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఉన్న మొక్కలు బుచ్చిరెడ్డిపాళెం రోడ్ అవెన్యూ ప్లాంటేషన్‌కు పంపాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. తిరిగి మొక్కల పెంపకంపై ఇంకా ఎటువంటి సమాచారం లేదు.

– అంకయ్య, ఆఫీసర్, సోషల్ ఫారెస్ట్

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



మాట్లాడుతున్న ఖాదర్‌వలీ

పొదలకూరు : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో పీఎం సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమం కింద సోమవారం గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ పరిశీలించారు. గర్భిణులకు పౌష్టికాహారం అందజేయడం ద్వారా తల్లీబిడ్డలకు సంపూర్ణ పోషకాలు అందుతాయని, తద్వారా మాతాశిశు మరణాలు తగ్గుతాయన్నారు. గ్రామాల్లో ఉన్న గర్భిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యాధికారులు పద్మావతి, మల్లికార్జునరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, శిరీష, శాస్త్రి, అనూరాధ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఇందిరమ్మ

పొదలకూరు: సైబర్ నేరస్తుల నుంచి వచ్చే ఫేస్‌బుక్ మెసేజ్‌లు, కాల్స్, లింక్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని మహ్మదాపురం క్లస్టర్ వెలుగు సీసీ ఇందిరమ్మ సూచించారు. తాటిపర్తి పంచాయతీ వరదాపురంలో సోమవారం ట్రీస్ స్వచ్ఛంద సంస్థ సెక్రటరీ షేక్ అహ్మద్ అక్షరాస్యత, పొదుపు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. సీసీ మాట్లాడుతూ బ్యాంకు ప్రతినిధులమని వచ్చే మెసేజ్‌లను నమ్మొద్దని, ఫోన్ ఓటీపీ, డెబిట్ కార్డుల పిన్, సీవీవీ నంబర్లు ఇతరులకు వెల్లడించకూడదన్నారు. సైబర్ నేరాలకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు ఎ.చంద్రశేఖర్, కే వెంకటేశ్వర్లు, సంఘబంధం అధ్యక్షురాలు మనెమ్మ, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి అధికారులకు శిక్షణ

పొదలకూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డీవీ నరసింహారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికంగా స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అందరూ విధిగా హాజరు కావాల్సిందిగా సూచించారు.

అదానీ ఒప్పందాలు రద్దు చేయాలి

ముత్తుకూరు: అదానీతో గత ప్రభుత్వం కుదుర్చుకొన్న విద్యుత్ ఒప్పందాలను కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మండల నాయకుడు తుంగా ఏడుకొండలు తదితరులు సోమవారం డీటీ ప్రదీప్‌కు వినతిపత్రం అందజేశారు. అమెరికాలో అదానిపై కేసులు నమోదు చేసిన నేపథ్యంలో ఈ ఒప్పందాలపై నిజానిజాలు ప్రజలకు తెలియజేసేందుకు సమగ్ర విచారణ జరిపించాలన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి



గర్భిణి మెడికల్ రిపోర్టును పరిశీలిస్తున్న డాక్టర్ మోహిసినా సుల్తానా

మనుబోలు: ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి మోహిసినా సుల్తానా అన్నారు. ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా 9 లేదా 10 తేదీల్లో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి రక్త హీనత, హైరిస్క్ ఉన్న గర్భిణులను గుర్తించి ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పిస్తామన్నారు. మాతాశిశు మరణాలను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ రాజయ్య, సూపర్‌వైజర్ రమణయ్య, హైమవతి, పద్మావతి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

అంతిమయాత్రకు అగచాట్లే



కాలువ నీటిలో మృతదేహాన్ని మోసుకెలుతున్న గ్రామస్తులు

మనుబోలు: బతికుండగా ఎన్ని కష్టాలు పడ్డా.. చనిపోయాక అయినా మృతదేహాన్ని ప్రశాంతంగా శ్మశానానికి సాగనంపాలనుకున్నా.. ఆ ఊరి వాళ్లకు కష్టాలు తప్పడం లేదు. మండలంలోని గురివిందపూడి మిక్స్‌డ్ కాలనీ వాసులు ఎవరైనా చనిపోతే మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించాలంటే అగచాట్లు తప్పడం లేదు. వర్షాకాలంలో మోకాలి లోతు నీటిలో శవాన్ని మోసుకుని వెళ్లాల్సిన దుస్థితి. శ్మశానానికి సరైన దారి లేకపోవడంతో చెరువు కలుజు నీటిని దాటుకుని వెళ్లాల్సి వస్తుంది. సోమవారం కాలనీకి చెందిన యామయ్య అనే వ్యక్తి చనిపోవడంతో శవాన్ని ఖననం చేసేందుకు నానా అవస్థలు పడినట్లు గ్రామస్తులు వాపోయారు.

కాకాణి వెంటే మా ప్రయాణం



మాజీ మంత్రి కాకాణిని కలిసిన పెమ్మారెడ్డి సోదరులు

ముత్తుకూరు: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెంటే తాము ప్రయాణిస్తామని మండలంలోని మామిడిపూడికి చెందిన సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకులు పెమ్మారెడ్డి బాబురెడ్డి, పెమ్మారెడ్డి పద్మనాభరెడ్డి స్పష్టం చేశారు. మాజీమంత్రి కాకాణిని నెల్లూరులోని నివాసంలో సోమవారం కలిసి ఈ విషయాన్ని స్పష్టం చేశారు. వారు మాట్లాడుతూ తాము పార్టీ మారుతున్నట్టు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. 2014, 2019, 2024 ఎన్నికల్లో తాము కాకాణి విజయం కోసం పనిచేశామని గుర్తు చేశారు. పార్టీని బలోపేతం చేయడం, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడమే తమ ధ్యేయమన్నారు.

సేంద్రియ ఎరువులే మేలు



కోడి పిల్లలను పంపిణీ చేస్తున్న దృశ్యం

ముత్తుకూరు: రసాయనిక ఎరువుల కంటే సేంద్రియ ఎరువులతో కూరగాయలు పండించడం మంచిదని నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ జీఎల్ శివజ్యోతి, ఇందుకూరుపేట వ్యవసాయశాఖ ఏడీ రాజ్‌కుమార్ సూచించారు. మండలంలోని తాళ్లపూడిలో సోమవారం పెరటి తోటలు, కోడిపిల్లల పెంపకంపై మహిళలకు శిక్షణ ఇచ్చారు. వరి సాగు చేసే రైతులు రసాయన ఎరువులు తగ్గించి, జీవన ఎరువులు వినియోగించడం ద్వారా 25 శాతం మోతాదును తగ్గించుకోవాలన్నారు. ఏఓ జోత్స్నరాణి, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఆర్ సుజాత, కిరణ్‌కుమార్‌రెడ్డి, వీఈఈ శ్రీను పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో వినతులు



అర్జీలను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

వెంకటాచలం: మండలంలోని సర్వేపల్లిలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలువురు అర్జీదారులు తమ సమస్యలపై తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతులు అందజేశారు. అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీటీ విజయ్, వీఆర్వో ముని, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో వైద్య శిబిరం

నెల్లూరు(అర్బన్): కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్ద సోమవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే అర్జీదారుల కోసం ఈ శిబిరం నిర్వహించారు. పలువురు షుగర్, బీపీ పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా స్వయంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి పెంచలయ్య మాట్లాడుతూ ప్రతి సోమవారం ఇక్కడ వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, అర్జీదారులతోపాటు చుట్టుపక్కల స్థానికులు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటికి కొత్త లుక్





వివిధ రకాల డిజైన్లు



- వివిధ రకాల్లో వాల్ డిజైన్లు
- గోడలకు సరికొత్త రూపు

కోవూరు: సొంతిల్లు. ఇది చాలామంది కల. దీనిని సాకారం చేసుకునేందుకు ఎంతో కష్టపడుతుంటారు. అందంగా కనిపించేందుకు.. అన్ని వసతులు సమకూర్చుకునేందుకు వెనుకాడరు. ఇటీవల కొందరు ఇళ్లను సరికొత్తగా మార్చేస్తున్నారు. కంప్యూటర్ టేబుల్, స్విచ్ బోర్డు, బెడ్ ల్యాంప్‌లున్న మూల, బెడ్ ఆనుకుని ఉన్న గోడ, ఇలా ఏ చోట అయినా చక్కని కాన్వాస్‌గా మార్చి కొత్త లుక్ ఇచ్చేస్తున్నారు. పక్షులు, చెట్లు, నక్షత్రాలు, సీతాకోకచిలుకల బొమ్మలతో గోడను నింపేస్తున్నారు. కాంటాక్ట్ పేపరుతో చేసే డెకార్లు తక్కువ ఖర్చుతో అయిపోతుంది. అయితే శ్రమ తప్పదు.

అలంకరించేందుకు..

ఒక్కొక్కరికి ఒక్కొక్క అభిరుచి ఉంది. దానికి అనుగుణంగా ఇంటిని అలంకరించేందుకు ప్రయత్నిస్తుంటారు. వారి కోసమే థీమ్ డెకార్ అందుబాటులో వచ్చింది. నచ్చిన థీమ్‌లను ఇంటి గోడలపై చిత్రీకరించుకోవచ్చు. వాల్ డెకార్, వాల్‌స్టిక్కర్ల పేరుతో బాగా పాపులరైంది. ఒకవేళ ఇంటి యజమాని ఆర్టిస్ట్ అయితే చక్కని చిత్రాన్ని వేసుకోవచ్చు. అలా వేసుకోలేని వారికి ఆన్‌లైన్ సర్వీస్‌లు, స్టిక్కర్లు అందుబాటులో ఉన్నాయి. కోవూరు మండలం పడుగుపాడు మండలం ఓ గృహ సముదాయంలో థీమ్ డెకార్ యూనిట్ కొనసాగుతోంది. ఇప్పటికే ఎంతో మంది ఈ డిజైన్లకు ఆకర్షితులై తక్కువ ఖర్చుతో వేయించుకుంటున్నారు. ఖాళీ గోడలను అందంగా చూసుకోవాలనే ఆసక్తి ఉంటే స్వయంగా ఈ స్టిక్కర్లు తయారు చేసుకోవచ్చు. గోడ సైజును బట్టి కాంటాక్ట్ పేపరు తెచ్చుకోవాలి. ఇందులోనూ రకాలున్నాయి. డిజైన్‌ను బట్టి వాటి ఖరీదు మారుతుంది. గ్రాఫిక్స్, ఫొటో ఎడిటింగ్, సాఫ్ట్‌వేర్లపై అవగాహన ఉంటే స్వతహాగా డిజైన్ తయారు చేసుకోవచ్చు. వినైల్ పేపరు మీద ప్రింట్ తీసి జాగ్రత్తగా కత్తిరిస్తేచాలు. అదిరిపోయే వాల్ ఆకట్టుకుంటుంది.

అందంతోపాటు రక్షణ

ఇది కేవలం అందం కోసమే కాదు ఇంటికి రక్షణ కవచంలా ఉంటుంది. జిల్లాలో చాలామంది వాల్ బోర్డులు, ఫర్నీచర్ పోను ఒక భాగంలో గోడను ఖాళీగా పెడుతున్నారు. దానిని వాల్ హ్యాంగింగ్స్ పెయింటింగ్స్‌తో అలంకరిస్తున్నారు. మొత్తంగా తమ అలంకరణ అభిలాషను అలా తీర్చుకుంటున్నారు. అయితే గోడల్ని మరింత అందంగా అలంకరించుకోచ్చు. ఇదంతా చాలా కష్టమని భావిస్తే మార్కెట్‌లో వాల్‌స్టిక్కర్లు లభిస్తున్నాయి. వీటి ధర రూ.100 నుంచి ప్రారంభమవుతుంది. ఆన్‌లైన్‌లో కూడా లభ్యమవుతున్నాయి.

అందంగా అలంకరించుకున్నాం



ప్రస్తుతం నూతన పద్ధతిలో మా ఇంటిని వాల్ పేపర్ స్టిక్కర్ మా ఇంటి గోడను అందంగా తీర్చిదిద్దుకున్నాం. స్టికర్ వేసి నాలుగు సంవత్సరాలైంది. ఇప్పటికి చెక్కు చెదరలేదు.

– విన్నకోట అశోక్, పడుగుపాడు

పెయింట్‌తో పనిలేదు



ఇంటి లోపల కొన్ని గోడలకు పెయింట్ ఖర్చు తగ్గించుకుని వాల్ స్టిక్కర్ ద్వారా అందంగా తీర్చిదిద్దుకున్నాం. వీటి ఖర్చు పెయింట్ కన్నా తక్కువ అవుతుంది. బెడ్‌రూమ్, హాల్, కంప్యూటర్ రూంలో స్టిక్కర్లు వేయడంతో అందంగా కనిపిస్తోంది.

– కోటపూరి రాజేష్, కోవూరు

నూతన విధానంతో తయారీ



గతంలో పెద్ద పెద్ద సిటీల్లోనే ఈ వాల్ పేపర్ డెకరేషన్లు ఉండేవి. నూతన విధానంతో ప్రజలకు పరిచయం చేసేందుకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలేశాను. వాల్‌పేపర్స్, థీమ్ డెకార్స్ డిజైన్లపై దృష్టి పెట్టాం. ప్రజలకు నచ్చిన రీతిలో వాల్‌పేపర్లు తయారుచేసి వారు అనుకున్న విధంగా అందిస్తున్నాం.

– మొయినుద్దీన్, వాల్ పేపర్ నిర్వాహకుడు, నెల్లూరు

గుంత.. తీరేనా చింత

- జాతీయ రహదారి పక్కన గుంతలు
- పడి గాయపడిన వారెందరో..
- పట్టించుకోని హైవే అధికారులు

జాతీయ రహదారి (ఎన్‌హెచ్ – 16) పక్కనున్న గుంతలు ప్రమాదకరంగా మారాయి. వాహనాలు రోడ్డు పక్కకు రావాల్సి వచ్చినప్పుడు ఆ గుంతల్లో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. హైవే అథారిటీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెం నుంచి కోవూరు మండలం నందులగుంట వరకూ జాతీయ రహదారిని ఆనుకుని అక్కడక్కడా గుంతలున్నాయి. వీటిని పట్టించుకోకుండా అలాగే వదిలేశారు. దీంతో వర్షాలు కురిసినప్పుడు నీరు నిలుస్తోంది. కొన్నిచోట్ల బురదగా మారి రాకపోకలు సాగించేందుకు జనం ఇబ్బందులు పడుతున్న పరిస్థితులున్నాయి.

ఆగిన సమయంలో..

హైవేపై వెళ్లే పెద్ద వాహనాలు ఏదైనా కారణంతో రోడ్డు పక్కకు రావాల్సి వస్తే ఆ గుంతల్లో పడి బోల్తాపడే ప్రమాదం ఉంది. ద్విచక్ర వాహనదారులైతే తరచూ వాటిల్లో పడి గాయపడుతూనే ఉన్నారు. నందులగుంట వద్ద ఊరికి, రోడ్డుకు మధ్యలో ఉన్నాయి. నార్తురాజుపాళెం ఆంజనేయస్వామి గుడి ఎదురుగా గుంతలున్నాయి. ఇక్కడ హోటళ్లు ఉండటంతో చాలామంది ఆగుతుంటారు. ఈ సమయంలో గుంతల్లో పడుతున్నారు. ఇక్కడి హోటళ్లు, దుకాణాలకు ద్విచక్ర వాహనదారులు వ్యతిరేక దిశలో వస్తున్నారు. వీరైతే తరచూ పడి గాయపడుతున్నారు. ఈ సమస్యను నిర్లక్ష్యంగా వదిలేస్తే గుంతలు ఇంకా పెద్దవిగా మారి ప్రాణాపాయంగా మారొచ్చు. హైవే అధికారులు పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నందులగుంట వద్ద హైవే పక్కన భారీ గుంత



నార్తురాజుపాళెం సమీపంలో..

ప్రమాదం పొంచి ఉంది



హైవేపై వెళ్లే సమయంలో ఫోన్ కాల్ వచ్చినా లేదా టీ అంగడి వద్ద ఆగాలన్నా భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్డు పక్కన గుంతలున్న విషయం పసిగట్టడం కష్టం. వర్షాకాలంలో నీరు ఉండటంతో గుంతల లోతు తెలియక వాహనాలు అదుపు తప్పుతున్నాయి. వీటితో ప్రమాదం పొంచి ఉంది. తక్కువ ఖర్చుతోనే పరిష్కరించ గలిగినా హైవే అధికారులు పట్టనట్లు వ్యవహరించడం శోచనీయం.

– పి.మధుసూదన్‌రెడ్డి, నార్తురాజుపాళెం, కొడవలూరు మండలం

పట్టించుకోకుంటే ముప్పే..



రోడ్డుకు ఆనుకుని పడిన గుంతలను నిర్లక్ష్యంగా వదిలేస్తే పెను ప్రమాదం పొంచి ఉంది. ఈ గుంతలన్నీ ఊరికి, రోడ్డుకు మధ్యలో ఉండటంతో కొందరు ద్విచక్ర వాహనాల్లో వ్యతిరేక దిశలో వస్తున్నారు. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే హైవేకు ఆనుకుని గుంతలుండటం ప్రమాదకరమని తెలిసినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం దారుణం.

– యు.జనార్ధన్, నాయుడుపాళెం, కొడవలూరు మండలం